
కుకునూరుపల్లి ఉన్నత పాఠశాలలో


చేర్యాల పంచతంత్ర పాఠశాలలో

పాఠశాలల్లో పండుగ సందడి

జిల్లాలోని పలు పాఠశాలల్లో గురువారం సంక్రాంతి సంబురాలను నిర్వహించారు. భోగి మంటలు, రంగవల్లుల కార్యక్రమాలతో పండుగ సందడి నెలకొన్నది. చిన్నారులు హరిదాసు వేషధారణలో ఆకట్టుకున్నారు. చేర్యాల పట్టణంలోని పంచతంత్ర, కృష్ణవేణి, గాయత్రీ పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు అంబరాన్నంటాయి. కుకునూరుపల్లి ఉన్నత పాఠశాలలో అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, డీఈవో శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. సంప్రదాయబద్ధంగా ఇటుకల పొయ్యిపై కుండను ఏర్పాటు చేసి పాలు పొంగించి విద్యార్థులతో కలిసి వేడుకలో ఉత్సాహంగా పాలుపంచుకున్నారు.

- కొండపాక/చేర్యాల, జనవరి 11





కిక్కిరిసిన బస్సులు

సంక్రాంతి పండుగకు వెళ్లే ప్రయాణికులతో గురువారం సిద్దిపేట బస్టాండ్ కిక్కిరిసిపోయింది. విద్యాసంస్థలకు పండుగ సెలవులు ప్రకటించడంతో సాయంత్రం సమయంలో వారి వారి గ్రామాలకు బయలుదేరారు.

- సిద్దిపేట అర్బన్, జనవరి 11


నంగునూరు మండలం ఖాతా శివారులో వరద ధాటికి చీలిన చెక్‌డ్యాం

ఖాతా చెక్‌డ్యాం ఖతం

- నాణ్యతకు తిలోదకాలు
- రూ.4.60 కోట్ల ప్రజాధనం గంగపాలు
- నిర్మించిన ఏడాదికే చీలిన వైనం
- మళ్లీ నిర్మించాలని రైతుల డిమాండ్

నంగునూరు, జనవరి 11 : అధికారుల నిర్లక్ష్యం.. కాంట్రాక్టర్ల ధనదాహం వెరసి చిన్నపాటి వరదకే చెక్‌డ్యాం కొట్టుకుపోయింది. నంగునూరు మండలం ఖాతా గ్రామ శివారులోని పెద్దవాగుపై నిర్మించిన చెక్‌డ్యాం కథ ఏడాది కాక ముందే గంగపాలైంది.

వర్షాకాలంలో ఎగువ ప్రాంతం నుంచి దిగువ ప్రాంతానికి వృథాగా వెళ్లే నీటికి అడ్డుకట్ట వేసి భూగర్భ జలాలు పెంపొందించాలని లక్ష్యంతో నంగునూరు మండలంలోని ఖాతా, ఘనపూర్, నంగునూరు, అక్కేనపల్లి గ్రామాల పరిధిలో పారే పెద్దవాగుపై రెండు దశాబ్దాలకాలంలో దశలవారీగా ఏడు చెక్‌డ్యాంలను నిర్మించారు. చెక్‌డ్యాంల నిర్మాణంతో వాగు పరిసర ప్రాంతంలో ఆయకట్టు సాగు పెరిగింది. అయితే ఖాతా గ్రామస్థుల అభ్యర్థన మేరకు మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే హరీశ్‌రావు దూల్మిట, ఖాతా గ్రామ శివారులో రెండు చెక్‌డ్యాంల నిర్మాణానికి పూనుకున్నారు. ఎగువన రూ.4.60 కోట్లతో ఒకటి, దిగువన రూ.4.75 కోట్లతో మరో చెక్‌డ్యాం నిర్మాణానికి 2020 మేలో శంకుస్థాపన చేశారు. ప్రారంభోత్సవం చేసిన ఏడాదికి సంబంధిత కాంట్రాక్టర్లు పనులు చేపట్టి 2022లో నిర్మాణం పూర్తి చేశారు. 2023లో వర్షాకాలంలో వచ్చిన వరద ధాటికి ఖాతా గ్రామ శివారులో రూ.4.60 కోట్లతో నిర్మించిన చెక్‌డ్యాం రెండుగా చీలిపోయింది. ఈ చెక్‌డ్యాం తెగిపోవడంతో పెద్దవాగులో కిలోమీటర్ మేర 10 అడుగుల లోతుతో ఉండాల్సిన నీరు వృథాగా కిందికి పోయింది.

అధికారుల నిర్లక్ష్యమే కారణం

ఏళ్ల పాటు నాణ్యతగా ఉండాల్సిన చెక్‌డ్యాం ఏడాదిలోపే మోస్తరు వరదకు కొట్టుకపోవడం చూస్తుంటే నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని స్పష్టమవుతుందని స్థానిక రైతులు మండిపడుతున్నారు. కాంట్రాక్టర్ల ధనార్జనకు తోడు, సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణమని ఆరోపిస్తున్నారు. రైతుల ప్రయోజనార్థం వెచ్చించిన కోట్ల నిధులు గంగపాలైంది. భూగర్భ జలాల పెంపు కోసం నిర్మించిన చెక్‌డ్యాం మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. గతంలో రెండు దశాబ్దాల క్రితమే ఖాతా-అక్కనపల్లి పెద్దవాగుపై ఏడు చెక్‌డ్యాంలు నిర్మించినప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. ఆయకట్టు రైతులకు రెండు పంటలకు ఉపయోగపడేలా నిలిచాయి. చెక్‌డ్యాం కొట్టుకుపోయిన విషయాన్ని సంబంధిత ఇరిగేషన్ అధికారులకు, స్థానిక నాయకులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడంలేదని రైతులు మండిపడుతున్నారు. ప్రభుత్వం స్పందించి నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్‌పై, అలాగే నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకొని తిరిగి చెక్‌డ్యాంను నిర్మించాలని వాగు పరీవాహక ప్రాంత రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

క్లీన్ సిటీగా హుస్నాబాద్ మున్సిపాలిటీ ఎంపిక

- మూడోసారి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు

హుస్నాబాద్, జనవరి 11 : స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో భాగంగా హుస్నాబాద్ మున్సిపాలిటీ క్లీన్ సిటీలో మూడో స్థానానికి ఎంపికైంది. దక్షిణ భారత దేశంలో 15,000- 25,000లోపు జనాభా గల పట్టణాల్లో హుస్నాబాద్ మున్సిపాలిటీ ఈ అవార్డుకు ఎంపికైంది. కాగా హుస్నాబాద్ మున్సిపాలిటీకి 2021లో ఫాస్టెస్ట్ మూవర్స్ సిటీగా, 2022లో బెస్ట్ సిటీ ఇన్ సిటీజన్ ఫీడ్ బ్యాక్ అవార్డులను దక్కించుకుంది. వరుసగా మూడోసారి అవార్డుకు ఎంపిక కావడం పట్ల చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ రాజశేఖర్ సంతోషం వ్యక్తంచేశారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మూడోసారి ఎంపిక కావడం అభినందనీయమన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ క్లీన్ సిటీ అవార్డు అందుకున్న సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్

సిద్దిపేట టౌన్, జనవరి 11 : స్వచ్ఛ్ సర్వేక్షణ్ 2022-2023కి గానూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో క్లీనెస్ట్ సిటీ విభాగంలో సిద్దిపేట మున్సిపాలిటీ మరోమారు దక్షిణ భారతదేశంలో జాతీయస్థాయిలో తన కంటూ గుర్తింపును చాటుతూ అవార్డు దక్కించుకున్నది. లక్ష జనాభా కలిగిన మున్సిపాలిటీల్లో పోటీ పడుతూ దక్షిణాదిలో రాష్ట్రస్థాయిలో సిద్దిపేట మున్సిపల్ నంబర్‌వన్‌గా నిలిచింది. ఈ మేరకు ఢిల్లీలో కేంద్ర హౌసింగ్, అర్బన్ డెవలప్‌మెంట్ కార్యదర్శి మనోజ్ జోషి నుంచి సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు, కమిషనర్ సంపత్‌కుమార్ స్వచ్ఛ్ సర్వేక్షణ్ అవార్డును అందుకున్నారు. సిద్దిపేట మున్సిపాలిటీకి మరోమారు అవార్డు రావడంతో పట్టణ ప్రజలు, అధికారులు హర్షం వ్యక్తం చేశారు. అందరి కృషి ఫలితంగానే అవార్డులను పొందుతున్నామని, ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అభినందలు తెలిపారు.


అవార్డును అందుకుంటున్న చైర్‌పర్సన్ మంజులరాజనర్సు, మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్

అమ్మవార్లకు ఎదురుచూపులే!

- మల్లన్న ఆలయంలో బంగారు కిరీటాల ఏర్పాటుకు మరో ఏడాది వేచిచూడాల్సిందే

చేర్యాల, జనవరి 11 : భక్తుల కోరికలు తీర్చే కోరమీసాల కొమురెల్లి మల్లన్న ఇరుపక్కలా కొలువైన మేడలమ్మ, కేతలాదేవికి బంగారు కిరీటాల ఏర్పాటు పట్ల దేవాదాయశాఖ వ్యవహరిస్తున్న తీరుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రెండేళ్ల క్రితం ఇచ్చిన హామీ మేరకు అప్పటి మంత్రి హరీశ్‌రావు మల్లన్నకు బంగారు కిరీటం తయారు చేయించారు. గతేడాది కల్యాణం రోజున అలంకరింపచేశారు. ఇదే క్రమంలో అమ్మవార్లకూ బంగారు కిరీటాలు చేయిస్తామని భక్తుల సమక్షంలో ప్రకటించారు. భక్తులు మొక్కులుగా అందించిన 8 కిలోలమేర బంగారంలో కిలోన్నర పరిమాణంతో మల్లన్నకు కిరీటం చేయించారు. ఇంకా 6.50కిలోల బంగారం అందుబాటులో ఉండటంతో అమ్మవార్లకు ఏర్పాటు చేయించాలన్న కోరికను నెరవేర్చుతామని తెలిపారు. దేవాదాయశాఖ అధికారులు, స్థపతి అమ్మవార్ల విగ్రహాలను పరిశీలించి కిరీటాల తయారీకి కొలతలను కూడా సేకరించారు. దీంతో ఈసారి కల్యాణానికి ఏర్పాటు చేస్తారని భక్తులంతా భావించారు. కానీ దేవాదాయ శాఖాధికారులు ఏడాది కాలంగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అమలుకు నోచుకోలేదు. గత ఆదివారం జరిగిన మల్లన్న కల్యాణం సందర్భంగా దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అమ్మవార్ల కిరీటం ఏర్పాటుపై ప్రకటన చేశారు. వచ్చే ఏడాది కల్యాణం నాటికి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గతంలోనే అమ్మవార్ల కిరీటాల ఏర్పాటు ప్రక్రియ చేపట్టినప్పటికీ చిత్తశుద్ధితో చర్యలు తీసుకుంటే ఈఏడాది జాతరకే తయారయ్యేవి. కానీ గతంలో ఇచ్చిన హామీనే ప్రస్తుత మంత్రి కొండా సురేఖతో చెప్పించడంపైనా ఆలయవర్గాల తీరుపై భక్తుల్లో విస్మయం వ్యక్తమవుతుంది.



ఏఈవో అంజయ్యను బదిలీ చేయాలి

కొమురవెల్లి మల్లన్న ఆలయ ఏఈవో వైరాగ్యం అంజయ్యను వెంటనే బదిలీచేయాలని కోరుతూ హైదరాబాదుకు చెందిన పునరుద్ధరణ కమిటీ సభ్యులు బి.మధు, కిరణ్‌యాదవ్ దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. గురువారం హైదరాబాదులోని కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఆలయ నిధుల దుర్వినియోగానికి పాల్పడటంతో పాటు అంజయ్య నకిలీ విద్యార్హత ధ్రువీకరణ పత్రాల దాఖలుపై సూపరింటెండెంట్‌గా రివర్షన్ అయ్యాడని పేర్కొన్నారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవడంతో పాటు వెంటనే బదిలీ లేదా డిప్యూటేషన్ చేయాలని కోరారు.

అప్రమత్తతతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట

- అపరిచితుల కాల్స్, మెసేజ్‌లకు స్పందించ వద్దు
- ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు ఎవరికీ చెప్పవద్దు
- సైబర్ క్రైం ఏడీజీ షీఖగోయల్

మెదక్ అర్బన్, జనవరి 11: సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సైబర్ క్రైం ఏడీజీ షీఖగోయల్ అన్ని జిల్లాల ఎస్పీ, సీపీలతోపాటు జిల్లా పోలీసు అధికారులకు సూచించారు. గురువారం సైబర్ నేరాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టెక్నాలజీని వాడుకొని నేరగాళ్లు, ప్రజలకు తెలియకుండానే వారి డబ్బులను దోచుకుంటున్నారని పేర్కొన్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇతర యాప్‌లు, లింకులు, ఈ-మెయిల్స్‌తో హ్యాకర్లు మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. పోలీసులు ఇటువంటి నేరాలపై దృష్టి సారించాలన్నారు. ప్రజలు మోసగాళ్ల ఉచ్చులో పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నకిలీ కస్టమర్‌కేర్ నంబర్లతో జాగ్రత్తగా ఉండాలని, ఓటీపీ, పాస్‌వర్డ్‌లు ఎవరడిగినా చెపొద్దన్నారు. మోసపోతే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్‌నేరాల నియంత్రణపై ప్రత్యేక మాడ్యూల్‌ను రూపొందించి శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. సమావేశంలో జిల్లా ఎస్పీ డా.బాలస్వామి, జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ సుభాష్‌చంద్రబోసు, సీఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

దుబ్బాక పీఏసీఎస్‌లో అవిశ్వాస సెగ

- అవినీతిపై పరస్పర ఆరోపణలు
- పోటాపోటీగా సమావేశాల నిర్వహణ

దుబ్బాక, జనవరి 11 : దుబ్బాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్)లో అసమ్మతి అవిశ్వాసానికి దారితీసింది. పీఏసీఎస్ చైర్మన్ శేర్ల కైలాస్ మీద సభ్యులు అవిశ్వాసానికి సిద్ధమయ్యారు. పీఏసీఎస్‌లో జరిగిన అవినీతిపై గురువారం పోటాపోటీగా సమావేశాలను ఏర్పాటు చేశారు. పీఏసీఎస్‌లో సుమారు రూ.36 లక్షలను అక్రమంగా తరలించినట్టుగా జిల్లా అధికారులు చైర్మన్‌కు, గత సీఈవోకు ఇప్పటికే నోటీసులను అందజేశారు. ఈనెల 15లోగా వాటిని చెల్లించాలని అధికారులు నోటీసులో పేర్కొన్నారు. చైర్మన్‌పై డైరెక్టర్‌లు ఇప్పటికే అవిశ్వాసం నోటీసు అందజేశారు. అయితే మంగళవారం నిర్వహించాల్సిన అవిశ్వాస పరీక్ష వాయిదా పడింది.

రైతుల డబ్బు మింగారు

దుబ్బాక పీఏసీఎస్ చైర్మన్ కైలాస్‌తోపాటు సీఈవో లక్ష్మారెడ్డి రైతుల డబ్బును దిగమింగారని, దీనిపై కలెక్టర్‌ను కలిసి అవిశ్వాస తీర్మాన పత్రాన్ని అందించామని పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్ గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. చైర్మన్ అవినీతి సొమ్ముతో కొంత మంది డైరెక్టర్లను గోవాకు తీసుకువెళ్లారని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి రైతుల సొమ్మును రీకవరీ చేయాలని డిమాండ్ చేశారు. రైతుల డబ్బుతో వినోద యాత్రలు చేస్తున్న చైర్మన్ నుంచి సొమ్మును కక్కించి, సస్పెండ్ చేయిస్తామన్నారు. ఆయనతోపాటు డైరెక్టర్‌లు కటికె బాల్‌రాజ్, యాదగిరి, ఆస భూదవ్వ తదితరులున్నారు.

కప్పిపుచ్చుకోవడానికే నెపం మోపుతున్నారు

దుబ్బాక వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాన్ని పూర్తిగా అవినీతిమయం చేశారని మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి ఆరోపించారు. తన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే ప్రస్తుత చైర్మన్ పాత పాలక మండలిపై నెపం మోపుతున్నారని మండిపడ్డారు. నాలుగేళ్లుగా ఏనాడు ఆరోపణలు చేయని చైర్మన్ అవినీతి నుంచి తప్పించుకోవడానికి తమను దోషులుగా చూపించాలనుకుంటే ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. దుబ్బాక పీఏసీఎస్‌లో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని తాను కలెక్టర్‌కు ఫిర్యాదు ఇస్తున్నట్టు రవీందర్ రెడ్డి తెలిపారు.

అవినీతిపై మేమే ఫిర్యాదు చేశాం

దుబ్బాక పీఏసీఎస్‌లో అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్, బీజేపీ నాయకులు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని చైర్మన్ కైలాస్ మండిపడ్డారు. గురువారం పీఏసీఎస్‌లో పలువురు డైరెక్టర్లతో కలిసి మాట్లాడారు. అవినీతికి పాల్పడ్డారని సీఈవో లక్ష్మారెడ్డిపై తానే ఫిర్యాదు చేశామని తెలిపారు. తమపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది కదా.. ఎందుకు విచారణ జరిపించడం లేదని ప్రశ్నించారు. తమ ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ డైరెక్టర్లు ఎల్లారెడ్డి, యాదగిరి తదితరులున్నారు.

తొమ్మిదేళ్లయినా పాలకవర్గం ఏర్పాటు చేయరా?

- కొత్త ప్రభుత్వంలోనైనా కొండపాక మార్కెట్ కమిటీని నియమించేనా?
- గతంలో గ్రూపు విభేదాలతో పెండింగ్

కొండపాక, జనవరి 11 : కొండపాక మార్కెట్ కమిటీ ఏర్పడి తొమ్మిదేళ్లు గడిచినా పాలకవర్గం మాత్రం ఇప్పటికీ ఏర్పాటు కాలేదు. మార్కెట్ కమిటీ ఏర్పడిన నాటి నుంచి పాలకవర్గం ఏర్పాటు చేయలేదు.

ఏకాభిప్రాయం లేకపోవడంతోనే..

కొండపాక మండలం మార్కెట్ కమిటీ 2014లో ఏర్పాటయింది. సుమారు మూడు కోట్ల వ్యయంతో మార్కెట్ కమిటీ కార్యాలయంతో పాటు గోదాములను నిర్మించారు. కొండపాక మండలం గజ్వేల్ నియోజకవర్గంలో కలిసిన తర్వాత కొండపాక గజ్వేల్ మార్కెట్ కిందికి వెళ్లింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత దాదాపు అన్ని మండలాల్లో మార్కెట్ కమిటీలను ఏర్పాటు చేయగా అంతటా పాలకవర్గాన్ని ఏర్పాటు చేసినప్పటికీ కొండపాక మండలంలో చేలేదు. ఈ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి జనరల్‌కు కేటాయించారు. మండలంలో పార్టీ నాయకుల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడంతో ఏర్పాటు చేయలేకపోయారని ప్రచారం ఉంది. మండలంలో ఐదారు గ్రూపులుగా నాయకులు ఉండడంతో ఎవరి వాదన వారు వినిపిస్తూ వారి అనుచరులకు పదవి ఇవ్వాలని అధిష్ఠానం దగ్గర ప్రయత్నాలు సాగించారు. ఏకాభిప్రాయం లేకపోవడంతో అప్పటి నుంచి ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదు. ఎవరికి ఇవ్వకపోవడంతో ఆశపడ్డ వారంతా నిరాశకు గురయ్యారు. చివరకు ప్రభుత్వం కూడా దిగిపోయింది.



కొండపాక మార్కెట్ కమిటీ కార్యాలయం

ఇప్పుడైనా ఏర్పాటు చేస్తారా?

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగా నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తామని సీఎం ప్రకటించడంతో కొండపాక మార్కెట్ కమిటీ కార్యవర్గం ఏర్పాటు కానుందని భావిస్తున్నారు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన వారికి పాలకవర్గంలో చోటు కల్పించే ఆలోచనలో అధిష్ఠానం ఉన్నట్టు తెలిసింది. కాగా పలువురు ఇతర పార్టీలకు చెందిన వారు కాంగ్రెస్ పార్టీలో చేరి నామినేటెడ్ పదవుల కోసం ప్రయత్నాలు సాగిస్తున్నట్టు సమాచారం. పార్టీ అధికారంలో లేకున్నప్పటికీ నిరాశ చెందకుండా పనిచేస్తున్న వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వాలని ఆ పార్టీ నాయకులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సూపర్‌వైజర్

వెల్దుర్తి, జనవరి 11: మండల పరిధిలోని మెల్లూరు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. బుధవారం ఎంపీపీ స్వరూప ఈ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి, స్టాక్ రిజిస్టర్‌కు, కేంద్రంలో ఉన్న సరుకుల నిల్వలకు మధ్య తేడా ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత ఈ అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్‌లో, కేంద్రంలో ఉన్న నిల్వ సమానంగా ఉందని, ఆమె తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మి తదితరులు ఉన్నారు.

'అధికారులను సస్పెండ్ చేయాలి'

హవేళిఘనపూర్, జనవరి 11; జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో పని చేస్తున్న అధికారులు నరేష్, నరసింహారావును సస్పెండ్ చేయాలని మండల కేంద్రంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుకు వ్యకాస జిల్లా కార్యదర్శి మల్లేశం గురువారం వినతిపత్రం అందజేశారు. 2022 సంవత్సరంలో వివిధ ప్రమాదాల్లో మరణించిన 38మంది మత్స్య కార్మికులకు ఆ అధికారుల కారణంగా ప్రమాద బీమా డబ్బులు రాలేదన్నారు. క్లెయిమ్ చేసేందుకు వారికి డబ్బులు ఇవ్వనందునే బీమా డబ్బులు రాకుండా చేశారని ఆరోపించారు. వారిని వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో బాధితులు బాబు, సులోచన, బాలరాజు తదితరులున్నారు.

'పెండింగ్ వేతనాలు ఇప్పించండి'

సంగారెడ్డి రూరల్, జనవరి 11 : తమకు రావాల్సిన పెండింగ్ వేతనాలు ఇప్పించి ఆదుకోవాలని రిసోర్స్ పర్సన్ (ఆర్పీ)లు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను కలిసి విన్నవించారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఆర్పీలు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఫార్మసిస్టుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

సంగారెడ్డి అర్బన్, జనవరి 11 : తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసిస్టుల అసోసియేషన్ జిల్లా ఎన్నికలు గురువారం జరిగాయి. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఈర్న భాస్కర్‌రావు అధ్యక్షతన జరిగిన ఎన్నికలో జిల్లా అధ్యక్షుడిగా రఘు, కార్యదర్శిగా జ్యోతి, కోశాధికారిగా వినోద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జగదీశ్‌స్వామి, ఉపాధ్యక్షులుగా మల్లయ్య, జబ్బార్, ముజాహిద్, కుమారస్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సురేశ్, జాయింట్ సెక్రటరీలుగా వెంకటేశం, శివకుమార్, శ్యామ్‌శంకర్, కసిని నాగరాజు, మెంబర్లుగా మాధవి, నర్సింలు, కల్పన, అనిత తదితరులు ఎన్నికయ్యారు.

నల్లపోచమ్మ ఆలయ హుండీ లెక్కింపు

కౌడిపల్లి, జనవరి11: తునికి నల్లపోచమ్మ ఆలయ హుండీని ఆలయ అధికారులు గురువారం లెక్కించారు. గత సంవత్సరం జూలై 13 నుంచి ఈనెల 10 వరకు వచ్చిన హుండి కానుకలను దేవాదాయశాఖ సహాయ కమిషనర్ శివరాజ్, ఇన్‌స్పెక్టర్ రంగరాజుల సమక్షంలో ఆలయ ఈఓ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో లెక్కించారు. హుండిలో వచ్చిన నగదును బ్యాంకులో జమ చేస్తామన్నారు.

టేక్మాల్‌లో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు

టేక్మాల్, జనవరి 11: టేక్మాల్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. పాఠశాలకు సెలవు ఉన్న రోజు ఆధార్ కేంద్రం మూసి ఉంటుందని తెలిపారు.

ఆధునిక పద్ధతులను పాటించాలి

రామాయంపేట, జనవరి 11: వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా వ్యవసాయాధికారులు రైతులకు ఆధునిక పద్ధతులపై సూచనలు, సలహాలు చేశారు. మండల పరిధి ధర్మారం గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ఏఓ రాజ్ నారాయణ వివరించారు.

ఎంఆర్ఐ ఏర్పాటు కోసం ఇంకెన్నాళ్లు వేచి చూడాలో!?

- సంగారెడ్డి జీజీహెచ్‌లో ఎంఆర్ఐకు భారీ డిమాండ్
- స్కానింగ్ అవసరమైతే గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులకు సిఫారసు
- అత్యవసరమైతే ప్రైవేటుకు
- మెడికల్ కాలేజీ ఏర్పాటుతో ఎంఆర్ఐపై ఆశలు

సంగారెడ్డి అర్బన్, జనవరి 11 : శరీరంలోని ఆరోగ్య సమస్యలు ఎక్స్‌రేలు, సీటీ స్కానింగ్‌ల్లో బయట పడపోతే ఎంఆర్ఐ(మ్యాగ్నెటిక్ రిసోనెన్స్ ఇమేజింగ్) పరీక్ష ద్వారా తెలుసుకోవచ్చు. దానికనుగుణంగా వైద్యం చేయడానికి వెసులుబాటు ఉంటుంది. గడ్డలు మెదడు, నరాలు, కండరాల సమస్యలు, వెన్నుపూస, ఎముకల సమస్యలు, పక్షవాతం, తలకి తీవ్ర గాయం, ఫిట్స్ తదితర సమస్యలు ఎంఆర్ఐలో స్పష్టంగా తెలుస్తాయి. వీటి ఆధారంగా డాక్టర్లు సరైన చికిత్స ప్రారంభించాల్సి ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఎంఆర్ఐ స్కానింగ్ ప్రస్తుతం జిల్లాలోని ఏ ఒక్క ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులో లేదు. రెండేళ్ల కిందట జిల్లా కేంద్రంలోని సంగారెడ్డిలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశారు. దానికి అనుబంధంగా 400 పడకల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఉన్నది. ఈ మధ్య ఎంఆర్ఐ స్కానింగ్‌కు భారీ డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో జీజీహెచ్‌లో ఎంఆర్ఐ స్కానింగ్ ఏర్పాటు ఆవశ్యకత ఉన్నది.



సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి

ఓపీకి నిత్యం వెయ్యి మంది

ఇలా ఉండగా సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి నిత్యం వెయ్యి మంది వరకు రోగులు వైద్య సేవల కోసం వస్తుంటారు. జిల్లాలోని నారాయణఖేడ్, జహీరాబాద్, పటాన్‌చెరు, జోగిపేట, సదాశివపేట ప్రాంతాల నుంచే కాకుండా పక్కనున్న వికారాబాద్, మోమిన్‌పేట, శంకర్‌పల్లి, మెదక్, బీదర్ తదితర ప్రాంతాల నుంచి రోగులు ఇక్కడి వస్తుంటారు. నెలకు సుమారు 800 ప్రసవాలు, వందల సంఖ్యలో వివిధ రకాల ఆపరేషన్లు జరుగుతుంటాయి. అంతే కాకుండా జిల్లా నుంచి రెండు జాతీయ రహదారుల మార్గాలున్నాయి. వందల మంది క్షతగాత్రులు చికిత్సకు ఇక్కడికి వస్తారు. ఇంతటి ప్రధానమైన ఈ జీజీహెచ్ ఆస్పత్రికి వచ్చే రోగుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని ఎంఆర్ఐ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎంఆర్ఐ కోసం హైదరాబాద్, లేదా ప్రైవేటుకు

ఎంఆర్ఐ స్కానింగ్ పరికరం స్థానికంగా అందుబాటు లేకపోవడంతో హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియా, ఇతర పెద్ద ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లాలని డాక్టర్లు సూచిస్తున్నారు. అక్కడికి వెళ్లలేని రోగులు దగ్గరలోని ప్రైవేటు కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. ప్రైవేటులో ఎంఆర్ఐకు రూ. 10 వేల నుంచి రూ. 20 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఆర్థిక భారంతో ప్రైవేటుకు వెళ్లలేక, చాలా మంది ఎంఆర్ఐ స్కానింగ్ తప్పనిసరైన వారు 60 కి.మీ దూరం ప్రయాణించి గాంధీ, ఉస్మానియాకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్థోమత లేని బాధితులు ఎంఆర్ఐ చేయించుకోలేక నానా అవస్థలు పడుతూ అలాగే ఉండిపోతున్నారు.

మెడికల్ కాలేజీ ఏర్పాటుతో ఎంఆర్ఐపై ఆశలు

ఇటీవలి కాలంలో ఎవరి నోటా విన్నా ఎంఆర్ఐ స్కానింగ్ చర్చే జరుగుతున్నది. ఏ ఇంట్లో చూసినా ఎవరో ఒకరు అనారోగ్య బారిన పడడం, డాక్టర్ దగ్గరికి వెళ్తే వారికి ఎంఆర్ఐ నివేదిక తప్పనిసరి చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ పరంగా స్థానికంగా ఎంఆర్ఐ స్కానింగ్ పరికరం అందుబాటులో లేదు. ఎన్నో ఏళ్లుగా ఎంఆర్ఐ స్కానింగ్ కోసం బాధితులు ఎదురుచూస్తున్నారు. కొత్త ఎంఆర్ఐ పరికరం కొనుగోలు చేయాలంటే రూ.10 నుంచి రూ.15 కోట్ల వరకు ప్రభుత్వం వెచ్చించాల్సి ఉంటుంది. ఏదేమైనా అత్యంత ప్రాధాన్యంగా మారిన ఎంఆర్ఐ స్కానింగ్ కోసం ఇప్పుడు డిమాండ్ పెరిగింది. మెడికల్ కాలేజీ ఏర్పాటైన నేపథ్యంలో ఎంఆర్ఐ స్కానింగ్ అందుబాటులోకి తీసుకురావాలని ఆ దిశగా ప్రజాప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని బాధితులు కోరుతున్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై ఫిర్యాదు

- స్పీకర్, ప్రభుత్వ సీఎస్, కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఫిర్యాదు

సంగారెడ్డి టౌన్, జనవరి 11 : ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ప్రభుత్వ సీఎస్ శాంతికుమారి, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతిలకు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గురువారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అసెంబ్లీ స్పీకర్, కలెక్టర్‌లకు ఆయన లేఖలు పంపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొనే బాధ్యత ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధిగా తనపై ఉన్నదని చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ నెల 10న సంగారెడ్డిలోని టీఎన్‌జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యేగా తాను హాజరైనప్పటికీ, డీసీసీ అధ్యక్షురాలి కోసం నిరీక్షించడం, ఆమె వచ్చే వరకు కార్యక్రమాన్ని మొదలుపెట్టకపోవడం తనకు, లబ్ధిదారులకు ఇబ్బంది కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాల పై సమగ్ర విచారణ జరిపి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని చింతా ప్రభాకర్ కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అసెంబ్లీ స్పీకర్, జిల్లా కలెక్టర్‌లకు పంపిన లేఖల్లో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తెలిపారు.

రైతులకు అనుసంధానకర్తలుగా నిలవాలి

- సంగారెడ్డి అదనపు కలెక్టర్ మాధురి


శిక్షణ పొందిన ఇన్‌పుట్ డీలర్లకు సర్టిఫికెట్లను అందజేస్తున్న అదనపు కలెక్టర్ మాధురి

సంగారెడ్డి రూరల్, జనవరి 11 : రైతులకు శిక్షణ పొందిన ఇన్‌పుట్ డీలర్లు అనుసంధానకర్తలుగా నిలవాలని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ మాధురి అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో గురువారం వ్యవసాయ శాఖ అధ్వర్యంలో ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణ అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ రైతులకు అనవసంగా ఎరువులు, పురుగు మందులు ఇవ్వకూడదని, సేంద్రీయ ఎరువులు వాడేలా అవగాహన కల్పించాలని సూచించారు. రైతులకు పెట్టుబడి తగ్గించి దిగుబడి పెంచే పద్ధతులను తెలపాలన్నారు. అనంతరం శిక్షణ పొందిన డీలర్లకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి నర్సింహారావు, డీపీడీ రామకృష్ణ, రమేష్, శ్రీనివాస్, గులామ్ మహ్మద్, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో శ్రీనివాస క్లినిక్ సీజ్


సంగారెడ్డిలో శ్రీనివాస్ క్లినిక్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ గాయత్రీదేవి

సంగారెడ్డి అర్బన్, జనవరి 11 : వైద్య ఆరోగ్య శాఖ నుంచి ఆయుర్వేదిక్ వైద్యం కోసం అనుమతి తీసుకుని హల్లోపతి వైద్యం చేస్తున్న సంగారెడ్డి పాత బస్టాండ్ అంబేద్కర్ చౌక్ సమీపంలోని శ్రీనివాస క్లీనిక్‌ను డీఎంహెచ్‌వో డాక్టర్ గాయత్రీదేవి గురువారం సీజ్ చేశారు. తనిఖీకి వెళ్లిన క్రమంలో బీఏఎంఎస్ డాక్టర్ ప్రభాకర్ హల్లోపతి వైద్య చేస్తున్నట్టు గుర్తించిన అధికారులు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ గాయత్రీదేవి మాట్లాడుతూ జిల్లాలో అన్ని ప్రైవేట్ హల్లోపతి, ఆయుర్వేదిక్ క్లినిక్‌లకు వైద్య ఆరోగ్య శాఖ అనుమతి తప్పనిసరన్నారు. అనుమతులులేనివారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తనిఖీల్లో పట్టుబడితే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఆయూష్ డాక్టర్లు ఆయూష్ ట్రీట్మెంట్ మాత్రమే చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వి.రవి, డెమో ప్రసాద్‌వీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెరువును పరిశీలించిన అధికారులు


చెరువును సందర్శించిన డీఎఫ్‌వో, ఇరిగేషన్, మత్స్య శాఖ అధికారులు

జిన్నారం, జనవరి 11: జిన్నారం రాయుని చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో వేసిన ఫెన్సింగ్ ప్రహరిని ఫారెస్టు, ఇరిగేషన్, మత్స్య శాఖ అధికారులు పరిశీలించారు. గురువారం జిన్నారం రాయుని చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉన్న ప్రహరిని డీఎఫ్‌వో శ్రీధర్‌రావు, ఇరిగేషన్ ఈఈ మధుసూదన్‌రెడ్డి, మత్స్య శాఖ అధికారి సతీష్ స్థానిక నాయకులు పరిశీలించారు. మూడేళ్ల క్రితం రాయుని చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రహరి నిర్మించి, ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం పట్ల మత్స్యకారులు, స్థానిక నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఇటీవల జిల్లా పరిషత్ సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా.. ఆమె ఆదేశాలతో మూడు శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. కాగా ఫారెస్టు, ఇరిగేషన్ శాఖల అధికారులు ప్రహరి ఏర్పాటు చేసిన స్థలం తమ శాఖలదేనని పేర్కొన్నారు. కాగా జిల్లా కలెక్టర్‌కు సమగ్ర నివేదిక అందజేస్తామని ఆయా శాఖల అధికారులు పేర్కొన్నారు.

ఎఫ్‌టీఎల్‌లోని అక్రమ నిర్మాణాల కూల్చివేత


బోర్పట్ల గ్రామంలో అక్రమంగా ఏర్పాటు చేసిన హద్దురాళ్లను కూల్చివేయిస్తున్న అధికారులు

హత్నూర, జనవరి 11: హత్నూర మండల పరిధిలోని బోర్పట్ల గ్రామ శివారులోని భీముని చెరువు ఎఫ్‌టీఎల్ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను గురువారం రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో ఉన్న నిర్మాణాలను ఎక్స్‌వేటర్‌తో తొలగించారు. ఎఫ్‌టీఎల్‌ల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని నీటిపారుదల శాఖ డీఈఈ రవికుమార్, ఏఈ భూపుత్ర, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సర్వేయర్ శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి రాకేష్ కుమార్ హెచ్చరించారు.

నిధులు మంజూరుకాక ఆగిపోయిన పనులు

- ముందుకు సాగని మైనార్టీ భవన నిర్మాణం

మనోహరాబాద్, జనవరి 11: మండలంలో పలు చోట్ల పేరుకే జడ్పీనిధులు కేటాయించడంతో పనులు ముందుకు సాగడం లేదు. మండలంలోని చాలా గ్రామాల్లో అనేక సంఘాల భవనాలకు జడ్పీ నిధుల నుంచి నిధులు మంజూరు చేశారు. కానీ నిధులు విడుదల కాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలో 9 నెలల క్రితం జడ్పీ చైర్‌పర్సన్ హేమలతశేఖర్‌గౌడ్ మైనార్టీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీనికి సుమారు 20 లక్షల రూపాయలను జడ్పీ నిధుల నుంచి మంజూరు చేశారు. కానీ మొదటి విడతగా 10 లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ప్రొసీడింగ్ పత్రాలిచ్చారు. 10 నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఒక్క చెక్కు కూడా జమ కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను మధ్యలో ఆపివేశాడు. ఇదిలా ఉండగా దండుపల్లి గ్రామ పంచాయితీ భవనం చుట్టూ ప్రహరీ నిర్మాణాకిఇ సుమారు 5 లక్షల రూపాయలు మంజూరు చేశారు. కానీ కాంట్రాక్టర్ లేక పనులు ఇంత వరకు మొదలు కాలేదు. మండలంలో చాలా చోట్ల సరైన సమాయానికి నిధులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేయడం లేదు. రంగాయపల్లి గ్రామంలో 6 నెలల కింద శిలాఫలకం వేసి చేతులు దులుపుకున్నారు. రంగాయపల్లి గ్రామంలో ఎస్సీ కమ్యునిటీ హాల్‌కు 8 నెలల క్రితం జడ్పీ చైర్‌పర్సన్ హేమలతశేఖర్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. సుమారు రూ.10 లక్షల వరకు భవనానికి మంజూరు చేశారు. కానీ ప్రస్తుతం పనులిక్కా ప్రారంభ దశలోనే ఉన్నాయి. మరో ఆరు నెలలో జడ్పీ చైర్‌పర్సన్ పదవీ కాలం ముగుస్తున్నందున నిధుల మంజూరుపై సందిగ్ధత నెలకొంది.


కాళ్లకల్ గ్రామంలో అసంపూర్తిగా మిగిలిన మైనార్టీ భవన నిర్మాణం

భూమిశిస్తుకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు ఓబన్న

- మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

మెదక్ అర్బన్, జనవరి 11: భూమిశిస్తుకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు ఓబన్న అని జిల్లా కలెక్టర్ రాజర్షిషా కొనియాడారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓబన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉయ్యాలవాడ నరసింహ రెడ్డి స్థాపించిన సైన్యానికి సైన్యాధిపతిగా ఉంటూ.. పోరాటాలు చేశారన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ఓబన్న పాత్ర కీలకమని, వారి వీరోచిత పోరాటాల స్ఫూర్తిని భావితరాలకు చాటి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అధికారి నాగరాజు, మనోహర్, సుమన్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.


ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఆస్పత్రి కార్మికులకు పెరిగిన వేతనాలు అమలు చేయాలి

- సీఐటీయూ నాయకుల డిమాండ్
- సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నా

సంగారెడ్డి అర్బన్, జనవరి 11 :పెంచిన వేతనాలు చెల్లించాలని కోరుతూ కార్మికులు సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికులకు రూ.15,600 వేతనం చెల్లింపులు చేస్తుంటే కాంట్రాక్టు సంస్థ మాత్రం రూ.10,500 చెల్లిస్తుందన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. వెంటనే పెంచిన వేతనాలను కాంట్రాక్టు సంస్థలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, కిరణ్, శోభ, మరియమ్మ, రమాదేవీ, రాజు, భవానీప్రసాద్ తదితరలు పాల్గొన్నారు.


సంగారెడ్డి జీజీహెచ్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

సౌకర్యాలు లేని సంక్షేమ హాస్టళ్లు

- ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్ఎఫ్ నేతల ఆరోపణ

మెదక్, జనవరి 11: విద్యార్థి వసతిగృహాలు సౌకర్యాల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్ఎఫ్ నేతలు ఆరోపించారు. గురువారం మెదక్‌లోని ఎస్సీ, బీసీ హాస్టళ్లను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. హాస్టల్ విద్యార్థులకు మినరల్ వాటర్ సౌకర్యం కల్పించాలన్నారు. దోమలు కారణంగా రాత్రి వేళల్లో విద్యార్థులకు నిద్ర ఉండడం లేదని వెంటనే దోమతెరలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన దుప్పట్లను సరఫరా చేయకపోవడంతో విద్యార్థులు చలికి తట్టుకోలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరుగుదొడ్ల నిర్వహన లేమి కారణంగా దుర్గంధం వెదజల్లుతున్నాయన్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు మెయిన్‌టెనెన్స్ కింద ఇచ్చే రూ.500లు వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో బాల్‌రాజ్, కిరణ్, కిషోర్, అశోక్, రమేష్, నరేందర్, నాగరాజు, రవి, సుకుమార్ పాల్గొన్నారు.


మెదక్‌లోని వసతిగృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్ఎఫ్ నేతలు

కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు న్యాయం చేయాలి

- ఎంపీపీ జంగం శ్రీనివాస్, ప్రజాప్రతినిధుల డిమాండ్


తహసీల్దార్ గ్రేస్‌బాయ్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎంపీపీ, ప్రజాప్రతినిధులు

పెద్దశంకరంపేట, జనవరి 11:పెద్దశంకరంపేట మండలపరిధిలోని ఆయాగ్రామాల కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలని పేట ఎంపీపీ జంగం శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు గురువారం తహసీల్దార్ గ్రేస్‌బాయ్‌కి వినతిపత్రం సమర్పించారు. కల్యాణలక్ష్మి పథకం ద్వారా మండలంలో పలువురు లబ్ధిదారులకు చెక్కులు మంజూరు అయ్యాయని, వాటిని వెంటనే లబ్ధిదారులకు అందించాలని వారు పేర్కొన్నారు. అలాగే పెద్దశంకరంపేట తిరుమలాపూర్ శివారులోని సర్వేనెంబర్లు 237, 238, 254 లో అధికారులు సర్వేనిర్వహించి, ప్రభుత్వ భూములను కాపాడాలన్నారు. ఈ సర్వే నెంబర్లలో ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారి నుంచి వెంటనే స్థలాలను తీసుకొని ప్రభుత్వ భూములను కాపాడాలని మండల ప్రజాప్రతినిధులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్‌ఎంపీపీ లక్ష్మీరమేష్, ఎంపీటీసీ వీణాసుభాష్‌గౌడ్, దత్తు, మండలసర్పంచుల ఫోరం అధ్యక్షుడు కుంట్ల రాములు, సర్పంచులు, నాయకులు నరేష్, రవీందర్, రమేష్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

జిన్నారం, జనవరి 1: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఇద్దరు మోడల్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. మోడల్ పాఠశాలకు చెందిన ఖుషి, ఇంటర్ విద్యార్థి బిక్కి రాష్ట్ర స్థాయిలో పాల్గొనే కబడ్డీ జిల్లా జట్టు నుంచి పోటీలో పాల్గొంటారని తెలిపారు.


ఖుషి, బిక్కి

చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

హత్నూర, జనవరి 11: చెట్టుకు ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన హత్నూర పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుర్కలఖానాపూర్ గ్రామ శివారులో గురువారం చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హత్నూర మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన చాకలి ప్రభాకర్(30) జీవనోపాధి కోసం సంగారెడ్డి పట్టణంలో నివాసం ఉండేవాడు. కొన్ని రోజుల క్రితం స్వగ్రామమైన వడ్డేపల్లి గ్రామానికి వచ్చాడు. వ్యక్తిగత కారణాల వల్ల గురువారం తుర్కలఖానాపూర్ గ్రామ శివారులోని చెట్టుకు వైరుతో ఉరేసుకని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో హత్నూర పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా చేశారు. మృతుడి భార్య చాకలి మహేశ్వరీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు.


ప్రభాకర్ (ఫైల్)

ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరి మృతి

హత్నూర, జనవరి 11: ఎదురెదురుగా వస్తున్న ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన హత్నూర మండలం దేవులపల్లి బస్టేజీ సమీపంలో బుధవారం రాత్రి చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం... దేవులపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులుగౌడ్, శంకర్‌గౌడ్ ఒక ద్విచక్రవాహనంపై దౌల్తాబాద్ నుంచి హత్నూర వైపు వెళ్తున్నారు. అటు నుంచి ఎదురుగా మరో ద్విచక్ర వాహనంపై నస్తీపూర్ గ్రామానికి చెందిన కూరగాయల వ్యాపారి గోపాల్, నర్సమ్మ దంపతులు వస్తున్నారు. రెండు దేవులపల్లి బస్టేజీ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో శంకర్‌గౌడ్(40) అక్కడికక్కడే మృతి చెందగా.. గోపాల్, నర్సమ్మతో పాటు ఆంజనేయులుగౌడ్‌లకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ సుభాష్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని నర్సాపూర్ మార్చురీకి తరలించి, పోస్టుమార్టం చేయించి కుటుంబీకులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు.


శంకర్‌గౌడ్ (ఫైల్)

వివేకానందుడి బాటలో నడవాలి

- ఏబీవీపీ మెదక్ విభాగ్ ఆర్గనైజేషన్ సెక్రటరీ బొడ లక్ష్మణ్

సంగారెడ్డి అర్బన్, జనవరి 11: ప్రతి ఒక్క విద్యార్థి, యువత వివేకానందుడి బాటలో నడవాలని ఏబీవీపీ మెదక్ విభాగ ఆర్గనైజేషన్ సెక్రటరీ బొడ లక్ష్మణ్ సూచించారు. స్వామి వివేకానంద 161వ జయంతిని ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. సంగారెడ్డిలోని ఐబీ వద్ద వివేకానం విగ్రహానికి ఆయన పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశాన్ని జాగృతం చేయడమే కాకుండా అమెరికా, ఇంగ్లాండ్‌ల్లో యోగ, వేదాంత శాస్త్రాలను తన ఉపన్యాసాల ద్వారా పరిచయం చేసిన ఖ్యాతి స్వామి వివేకానందకే దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ఆకాశ్, తానాజీ, శశాంక్, దినేష్, అనూష, భానుప్రకాశ్, నిఖిల్, వెంకట్రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సంగారెడ్డిలోని ఐబీ వద్ద వివేకానంద విగ్రహానికి నివాళులర్పించిన ఏబీవీపీ నాయకులు

ఐటీఐ కళాశాలలో వివేకానంద జయంతి

గుమ్మడిదల, జనవరి 11 : స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని స్థానిక గుమ్మడిదల వీరభద్ర ఐటీఐ కళాశాలలో స్వామి వివేకానంద జయంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్ మాట్లాడుతూ భారత దేశ గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియజేసిన యోధుడు వివేకానందుడన్నారు. ఇనుప కండరాలు, ఉక్కు నరాలు కలిగిన యువకులు దేశానికి అవసరమని, స్వామి వివేకానందాన్ని యువత ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఉన్నతమైన లక్ష్యాలను అందుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి కల్యాణ్, జగదీష్, శ్రీకాంత్, భరత్, రోజా, శ్రీవాణి విద్యార్థులు పాల్గొన్నారు.


గుమ్మడిదల ఐఐటి కళాశాలలో స్వామి వివేకానంద గురించి విద్యార్థులకు వివరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్

కార్యకర్తలను కంటికిరెప్పలా కాపాడుకుంటా: 'పల్లా'

చేర్యాల, జనవరి 11: తన బలం, బలగమైన బీఆర్ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. చేర్యాల, కొమురవెల్లి మండలాల బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశం గురువారం పట్టణంలోని రేణుకాగార్డెన్స్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. పార్టీ కార్యకర్తలు నారాజ్‌కు గురికావద్దని, అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన పాటుపడుతూ సేవలందించాలన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సర్కార్ పథకాలు శ్రీరామరక్షగా నిలవడంతో పాటు పార్టీ కార్యకర్తల కృషితో తాను గెలిచానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన ఆరు గ్యారంటీలను ప్రతీ అర్హుడికి అందించేలా బీఆర్ఎస్ క్యాడర్ పని చేయాలని సూచించారు. అనంతరం ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారుడు కడవేరుగు గ్రామానికి చెందిన గదరాజు మనోహర్‌కు మంజూరైన కారును అందజేశారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ సుంకరి మల్లేశం, ఎంపీపీలు తలారి కీర్తన, వుల్లంపల్లి కరుణాకర్, జడ్పీటీసీ సిలివేరు సిద్ధప్ప, మునిసిపల్ ఛైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, వైస్ ఎంపీపీ నిమ్మ రాజీవ్‌రెడ్డి, మార్కెట్ వైస్ ఛైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పథకాలు పక్కదారి పడితే వెనక్కితగ్గేది లేదు

మద్దూరు, జనవరి 11: పథకాలు పక్కదారి పడితే వెనక్కి తగ్గేది లేదని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. మద్దూరులోని తాజ్‌గార్డెన్‌లో ఉమ్మడి మండల పార్టీ అధ్యక్షులు మేక సంతోష్, మంద యాదగిరి అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యకర్తల కృతజ్ఞత సభలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడం ఏమిటని ప్రశ్నిస్తే మీరు ఉంటే ఉండండి.. లేదంటే వెళ్లిపోవచ్చనే అరాచక పద్ధతిని ఎక్కడా చూడలేదన్నారు. ప్రొటోకాల్ ఉల్లంఘించినా, నా గౌరవం తగ్గినా పరవాలేదు. కానీ ప్రభుత్వపరంగా అమలుచేసే పథకాలు ప్రజలకు చెందేవిధంగా చూడడంలో వెనక్కి తగ్గనని చెప్పారు. నీలిమా ఆస్పత్రిలో ఈ ప్రాంత పేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తానని హామీఇచ్చారు. అంతకుముందు ఎమ్మెల్యేను కార్యకర్తలు, నాయకులు శాలువాలతో సన్మానించారు. ఎంపీపీ కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు ఖాజా ఆరీఫ్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


చేర్యాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మల్లన్న ఆలయ ఒగ్గుకథ, జానపద కళాకారుల సంఘం ఆందోళన

చేర్యాల, జనవరి 11: తమ ఇలవేల్పు దైవమైన కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి తమను రానీయకుండా అడ్డుకుంటూ పలువురు స్థానిక ఒగ్గు పూజారులు అన్యాయం చేస్తున్నారని, ఈ విషయమై తమకు న్యాయం చేయాలని కోరుతూ హైదరాబాద్ ఒగ్గుకథ, జానపద కళాకారులు గురువారం మల్లన్న ఆలయ ఆవరణలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయాధికారులతో పాటు కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. పురాతన కాలంలో కొద్దిపాటి జనసంచారంతో ఉండే ఆలయానికి తాము హైదరాబాద్ నుంచి భక్తులను జాతరకు తీసుకొచ్చి ఆలయాభివృద్ధికి పాటుపడుతున్నామని తెలిపారు. స్థానిక ఒగ్గుపూజారులు తమను అడ్డగించడంతో డబ్బులు అధికంగా డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. తోటి కళాకారులుగా తమను గుర్తించాల్సింది పోయి నికృష్టంగా ప్రవర్తిస్తున్నారని, ఈ విషయమై తమతో ప్రేమ పూర్వకంగా మెదిలేలా చర్యలు తీసుకుని ఆనవాయితీని పరిరక్షించాలని కోరారు.

తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాలను నిలిపివేయాలి

● టీపీటీఎఫ్ మండలాధ్యక్షుడు నిమ్మ బాపురెడ్డి

చేర్యాల, జనవరి 11: ఉపాధ్యాయులను మానసిక ఆందోళనకు గురిచేస్తున్న తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాలను ప్రభుత్వం నిలిపివేయాలని టీపీటీఎఫ్ మండలాధ్యక్షుడు నిమ్మ బాపురెడ్డి అన్నారు. గురు వారం చేర్యాల పట్టణంలో జరిగిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉన్నప్పటికీ విద్యార్థుల అభివృద్ధికి శ్రమిస్తుండగా, పీరియడ్ పథకాలు, దినచర్యల పేరిట విద్యార్థుల అభ్యసన కుంటుపడేలా చేస్తున్నారన్నారు. ఈ విషయమై ప్రభుత్వం ఆలోచించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుని ఉపశమనం కలిగించాలన్నారు. అనంతరం 2024 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. యూనియన్ నాయకులు రాంరెడ్డి, వెంకటమరణ, సుధాకర్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు, నరేశ్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

దూళిమిట్టలో మండలస్థాయి కబడ్డీ పోటీలు


ప్రథమస్థానంలో నిలిచిన మద్దూరు మోడల్ స్కూల్ విద్యార్థినులకు షీల్డులు ప్రదానం చేస్తున్న జడ్పీటీసీ కొండల్‌రెడ్డి

మద్దూరు, జనవరి 11: దూళిమిట్ట మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఉమ్మడి మండలాలకు వన్‌డే పాఠశాల స్థాయి కబడ్డీ పోటీలను గురువారం జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పోటీల్లో బాలికలు 5, బాలురు 6 జట్లు పాల్గొన్నాయని తెలిపారు. ప్రథమస్థానంలో మద్దూరు మోడల్‌స్కూల్ బాలికలు, ద్వితీయస్థానంలో దూళిమిట్ట ఉన్నత పాఠశాల బాలికలు విజేతలుగా నిలిచారు. కాగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో విజేతలకు షీల్డ్‌లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నర్సింహారెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం కర్ణాకర్‌రెడ్డితో పాటు దబ్బుడు వేణుగోపాల్‌రెడ్డి, పీడీ ప్రేమ్‌కుమార్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

ఓపెన్ డిగ్రీ స్పాట్ అడ్మిషన్ల గడువు తేదీ పెంపు

చేర్యాల, జనవరి 11: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరబోయే విద్యార్థుల ప్రయోజనం కోసం స్పాట్ అడ్మిషన్ల గడువుతేదీని ఈనెల 31 వరకు పొడిగించినట్లు చేర్యాల డిగ్రీ కళాశాల స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ కే.నాగేందర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే వార్షిక పరీక్ష ఫీజును ఈనెల 17లోగా చెల్లించాలని, రూ.500 అపరాధ రుసుముతో 23లోగా చెల్లించాలని తెలిపారు. ఫిబ్రవరి 16 నుంచి మార్చి 3 వరకు డిగ్రీ ద్వితీయ సంవత్సరం సెమిస్టర్-3, తృతీయ సంవత్సరం సెమిస్టర్-5 పరీక్షలు జరుగుతాయన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్/మద్దూరు, జనవరి 11: తెలంగాణ మోడల్ స్కూల్‌లో 2024-25వ సంవత్సరానికిగానూ 6వ తరగతిలో వంద సీట్లకు, 7 నుంచి 10వ తరగతి వరకు గల ఖాళీ సీట్ల ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైందని గజ్వేల్ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఈ.గోపీ ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా 12 నుంచి ఫిబ్రవరి 22 వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 7న ఉదయం 10 నుంచి 12 వరకు 6 తరగతి ప్రవేశ పరీక్ష, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు 7 నుంచి 10వ తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లకు ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు రూ.125, ఇతరులకు రూ.200 దరఖాస్తు రుసుం ఉంటుందన్నారు. హాల్ టికెట్లు ఏప్రిల్ 1 నుంచి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయని, డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. వివరాలకు మోడల్ స్కూల్ అఫీషియల్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. మద్దూరు మండలంలోని మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ప్రిన్సిపాల్ గుమ్మడిరాజు వెంకన్న తెలిపారు.

ఫొటోగ్రాఫర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

కొండపాక, జనవరి 1: కొండపాక మండలం ఫొటోగ్రాఫర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం మండల పరిధి దుద్దెడ గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయం వద్ద ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బ్రహ్మాచారి, ఉపాధ్యక్షుడిగా నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా దేవేందర్, కోశాధికారిగా కృష్ణ, సలహాదారులుగా సంజీవ్, సురేందర్, కిషన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. సభ్యులు వెంకటేశం, లక్ష్మణ్, రవి, సంపత్, స్వామి, పరమేశ్వర్ సతీష్, విష్ణు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ చొరవతో బాలికల హాస్టల్‌కు నీటి వసతి

మద్దూరు, జనవరి 11: మద్దూరు మండల కేంద్రం మోడల్ స్కూల్‌లోని బాలికల హాస్టల్‌లో నీటి వసతి ఏర్పాటుకు జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి చొరవ చూపారు. ఈ మేరకు నీటి సౌకర్యానికి బోరు వేయించి బాలికల ఇబ్బందులను తొలగించారు. జడ్పీటీసీ కొండల్‌రెడ్డి మాట్లాడారు. పాఠశాలకు ఉన్న బోరు ద్వారా గతంలో నీళ్ల సరఫరా ఉండేవని, ప్రస్తుతం సంవత్సరన్న కాలంగా బోరు నీళ్లు అందివ్వకపోవడంతో హాస్టల్‌కు మిషన్‌భగీరథ నీళ్లు అరకొరగా వస్తుండడంతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను ఇటీవల జిల్లా పరిషత్‌లో నిర్వహించిన సమావేశంలో సభ దృష్టికి తీసుకెళ్లడంతో బోరు మంజూరు ఇచ్చారన్నారు.

బంగ్లా వెంకటాపూర్‌లో భారత్ సంకల్ప్ యాత్ర


సంక్షేమ పథకాల పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్న గ్రామస్థులు

గజ్వేల్ రూరల్, జనవరి 11: గజ్వేల్ మండలం బంగ్లా వెంకటాపూర్ గ్రామంలో భారత్ సంకల్ప్ యాత్రను గురువారం బీజేపీ గజ్వేల్ అసెంబ్లీ కన్వీనర్ బండార్ మహేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న ఆయుష్మాన్ భారత్, ముద్రా లోన్లు, పీఎం ఆవాస్ యోజన తదితర పథకాల గురించి ప్రజలకు వివరించేందుకు ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు పంజాల అశోక్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కుమార్, నాయకులు నర్సింహులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి సీఎం చిత్రపటం బహూకరణ

చిన్నకోడూరు, జనవరి 11: చిన్నకోడూరు తహసీల్దార్ కార్యాలయానికి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని కాంగ్రెస్ బీసీ సెల్ మండలాధ్యక్షుడు చిరంజీవి బహూకరించారు. కాంగ్రెస్ యువజన జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్జుయాదవ్, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి దిలీప్‌కుమార్, నాయకులు మల్లేశం పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా సంయుక్త కార్యదర్శిగా కనకయ్య

నంగునూరు, జనవరి 11: ఎమ్మార్పీఎస్ జిల్లా సంయుక్త కార్యదర్శిగా నంగునూరు మండలం ఖాతా గ్రామానికి చెందిన ఆరెపల్లి కనకయ్యను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా గురువారం విలేకరులతో కనకయ్య మాట్లాడుతూ నా మీద నమ్మకంతో ఇచ్చిన పదవికి పూర్తిస్థాయిలో న్యాయం చేస్తానని తెలిపారు.

సమాచారం

రామక్కపేటలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు

దుబ్బాక, జనవరి 11: ప్రతిఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని డిస్ట్రిక్ ప్రోగ్రామ్ మేనేజర్ (డీపీఎం) డానియల్ అన్నారు. గురువారం దుబ్బాక మండలం రామక్కపేట గ్రామంలో రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సహకారంతో జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణపై కళాజాత ప్రదర్శన నిర్వహించారు. కళాకారులు భుజంగం, మురళీ, ఓంకారం, కృష్ణమౌళి ఉన్నారు.

పద్మశాలీ సమాజ క్యాలెండర్ ఆవిష్కరణ

చేర్యాల, జనవరి 11: పద్మశాలీ సమాజం ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం చేర్యాల పట్టణంలోని మార్కండేయ ఆలయ ఆవరణలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆడెపు చంద్రయ్య ఆవిష్కరించారు.

మర్పడగలో ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షింతలు

కొండపాక, జనవరి 11: మండలంలోని మర్పడగ గ్రామంలోని ఆలయాల్లో అయోధ్య రాముడి అక్షింతలకు ప్రత్యేక పూజలు చేసి ఇంటింటికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏమల్ల రజితారాజిరెడ్డి, కమిటీసభ్యులు పాల్గొన్నారు.

రాంనగర్‌లో మట్కా నిర్వాహకుడి అరెస్టు

జహీరాబాద్, జనవరి 11: జహీరాబాద్ పట్టణంలోని రాంనగర్‌లో మట్కా నిర్వాహకుడు మహ్మద్ రఫీని గురువారం అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రాంనగ్‌కు చెందిన మహ్మద్ రఫీ మట్కాను ఆడిస్తున్న క్రమంలో తమ సిబ్బంది గమనించి పట్టుకున్నారని చెప్పారు. అతడి నుంచి రూ.లక్ష నగదు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని ఎస్ఐ తెలిపారు. రఫీని రిమాండ్‌కు పంపించామన్నారు.

ఆస్పత్రి అడ్వయిజరీ కమిటీ సమావేశం

నర్సాపూర్, జనవరి 11: నర్సాపూర్ ఆస్పత్రి వద్ద గురువారం అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే సునితారెడ్డి హాజరై మాట్లాడారు. రోగులకు ఇబ్బందులు లేకుండా సేవలందించాలని సూచించారు. ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది లేక ఆశించిన స్థాయిలో సేవలు అందించలేక పోతున్నామని డాక్టర్ పావని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వైద్యులు, సిబ్బంది కొరత తీర్చడానికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే చెప్పారు. ఈసీహెచ్ డాక్టర్ చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో చందునాయక్, మున్సిపల్ ఛైర్మన్ నయీముద్దీన్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

సిద్దిపేట టౌన్, జనవరి 11: సిద్దిపేటలోని శ్రీచైతన్య పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు పాఠశాల ప్రాంగణాన్ని రంగవల్లులతో అందంగా అలంకరించారు. గొబ్బెమ్మలను పెట్టి భోగి మంటలు వెలిగించి, ఆట, పాటలతో అలరించారు. ప్రధానోపాధ్యాయుడు ఎజాజ్‌అలీ, ఏజీఎం మధు, కోఆర్డినేటర్ లక్ష్మీనాయుడు, అకాడమిక్ డీన్ కర్ణాకర్‌రెడ్డి, ఇన్‌చార్జిలు రాజన్న, బాబు, కవిత, లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ పట్టణంలో..

హుస్నాబాద్ టౌన్, జనవరి 11: హుస్నాబాద్ పట్టణంలోని పలు పాఠశాలల్లో గురువారం ముందస్తు సంక్రాంతి పండుగ వేడుకలను ఘనంగా జరిగాయి. పట్టణంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆకుల రజిత హాజరై గెలుపొందిన విద్యార్థినిలకు బహుమతులను ప్రదానం చేశారు. వైస్ ఛైర్‌పర్సన్ అనిత, కౌన్సిలర్ నళినిదేవి, ప్రిన్సిపాల్ అన్నపూర్ణ తదితరులున్నారు. అలాగే పట్టణంలోని శిశుమందిర్ పాఠశాలలో వేడుకలను జరిపారు. పాఠశాల ఉపాధ్యక్షులు చిట్టి దేవేందర్‌రెడ్డి, కార్యదర్శి రాంరెడ్డి, హేమలత పాల్గొన్నారు. పట్టణంలోని నవభారత్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు కైట్ ఫెస్టివల్ నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ గంగరవేని రవి, డైరెక్టర్ వేల్పుల శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్ వినీష్‌కుమార్ తదితరులున్నారు. 14న హుస్నాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మిత్రమండలి-87, హెచ్‌డీసీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడె బూట్ల రాజమల్లయ్య, హెచ్‌డీసీ నిర్వాహకులు ఇర్రి రాజిరెడ్డి తెలిపారు. ఆసక్తిగల మహిళలు తమ పేర్లను 9441431287 నెంబర్‌కు ఫోన్‌చేసి నమోదు చేసుకోవాలని కోరారు.


హుస్నాబాద్ టౌన్: మోడల్ స్కూల్‌లో విద్యార్థినులు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న ఛైర్‌పర్సన్ రజిత


మిరుదొడ్డి మోడల్ స్కూల్‌లో పిండి వంటకాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సెయింట్ మేరీస్‌లో

గజ్వేల్, జనవరి 11: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్ సీబీఎస్ఈ పాఠశాలలో సంక్రాంతి సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. చిన్నారులకు బోగీపండ్లు పోసి, ముగ్గులు వేసి, నృత్యాలతో అలరించారు. పాఠశాల కరస్పాండెంట్ ఇన్నారెడ్డి, ప్రిన్సిపల్ విజయపాల్‌రెడ్డి, పాఠశాల డైరెక్టర్ థామస్‌రెడ్డి, ఇన్‌చార్జిలు లావణ్య, శమంత పాల్గొన్నారు.

మిరుదొడ్డి మోడల్ స్కూల్‌లో

మిరుదొడ్డి, జనవరి 11: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గురువారం మిరుదొడ్డి మోడల్‌స్కూల్‌లో పిండి వంటకాల ప్రదర్శన నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కమలాకర్‌రెడ్డి పిండి వంటకాలను సందర్శించారు. ప్రిన్సిపాల్ భారతి, ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి ఉన్నారు.

వికాస్ హైస్కూల్‌లో

సిద్దిపేట అర్బన్, జనవరి 11: వికాస్ హైస్కూల్‌లో ముందస్తు సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీ నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రిన్సిపాల్ మధుమోహన్ అందజేశారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో

కొండపాక, జనవరి 11: ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతిని పురస్కరించుకుని విద్యార్థులకు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ముగ్గుల పోటీ నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. డీఈవో శ్రీనివాస్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, వాసవీ క్లబ్ అధ్యక్షుడు రాజు, సెక్రటరీ శివప్రసాద్ పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న సేవలు మరువలేనివి: జడ్పీ ఛైర్‌పర్సన్

సిద్దిపేటరూరల్/కొండపాక, జనవరి 11: వడ్డే ఓబన్న లాంటి మహనీయుల త్యాగ ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందని జడ్పీ ఛైర్‌పర్సన్ రోజారాధాకృష్ణశర్మ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న 217వ జయంతిని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విపంచి కళా నిలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. జడ్పీ ఛైర్‌పర్సన్ రోజాశర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని ఓబన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బీసీలలో ఏ కులానికి చెందిన మహనీయుల వర్ధంతి, జయంతులైనా బీసీ కులాలందరూ తమ వారుగా భావించి జరపాలన్నారు. వచ్చే జయంతి నాటికి సిద్దిపేటలో ఓబన్న విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ అధికారి సరోజ, కౌన్సిలర్ ఆలకుంట కవిత, వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మహేందర్, పలు సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు. వడ్డే ఓబన్న 217వ జయంతిని కొండపాక మండలం వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద వడ్డెర సంఘం నాయకుడు రేపాక స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్నదృశ్యం

పుస్తక పఠనం విజ్ఞానాన్ని పెంపొందిస్తుంది

కొండపాక, జనవరి 11: గ్రంథాలయాలు విజ్ఞానానికి దోహదపడతాయని సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ అన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌరపఠన కేంద్రాన్ని గురువారం ఆమె సర్పంచ్ పోల్కంపల్లి జయంతీనరేందర్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. గ్రంథాలయాన్ని అందరూ వినియోగించుకోవాలని సూచించారు. సరిపోయే పుస్తకాలు గ్రంథాలయంలో ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ అధికారి రాజుకు తెలిపారు. డీఈవో ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఆర్ సంస్థ ఛైర్మన్ పోల్కంపల్లి నరేందర్, సంపత్, అమర్, మాజీ సర్పంచ్ కాచం నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా సర్పంచ్ జయంతి అదనపు కలెక్టర్‌ను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం కుకునూరుపల్లి ఉన్నత పాఠశాలను అదనపు కలెక్టర్ సందర్శించి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారిని వివిధ అంశాలలో ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. ఆమె వెంట డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సత్తయ్య, సర్పంచ్ పోల్కంపల్లి జయంతీనరేందర్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.


అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్‌కు జ్ఞాపికను అందజేస్తున్న సర్పంచ్


గజ్వేల్‌లో 49వ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ, కాసాని, ప్రతాప్‌రెడ్డి

గ్రామీణ ప్రాంతాల్లోనే మెరికల్లాంటి క్రీడాకారులు

● ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి

గజ్వేల్, జనవరి 11: గ్రామీణ ప్రాంతాల నుంచే మెరికల్లాంటి క్రీడాకారులు బయటకు వస్తారని శాసనమండలి సభ్యులు డాక్టర్ వంటేరి యాదవరెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఐవోసీ మైదానంలో 49వ రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ ఛాంపియన్‌షిప్-2024 పోటీలను కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా ఛైర్మన్, ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ ఛైర్మన్ ఎన్‌సీ రాజమౌళిలతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. గజ్వేల్‌లో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచే నైపుణ్యం, నాణ్యత గల క్రీడాకారులు బయటకు వస్తారన్నారు. వారివెంట ఎంపీపీ దాసరి అమరావతి, వైస్ ఛైర్మన్ జకీయోద్దీన్, కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్, మహిళా అధ్యక్షురాలు దండుగుల రాజేశ్వరీ, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్‌సీ సంతోష్‌కుమార్ ఉన్నారు.

ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణంపై దుష్ప్రచారాన్ని నమ్మొద్దు


నర్మెట్ట గ్రామంలో నిర్మిస్తున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులను పరిశీలిస్తున్న సోంరెడ్డి

నంగునూరు, జనవరి 11: రైతుల ప్రయోజనార్థం నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో నిర్మిస్తున్న ఆయిల్‌పామ్ కర్మాగార నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతుందని చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మొద్దని ఆయిల్‌పామ్ రైతు వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి అన్నారు. గురువారం ఆయిల్‌పామ్ కర్మాగార నిర్మాణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇక్కడి రైతుల ఆర్థిక స్వావలంబన కోసం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు కృషితో రూ.300 కోట్లతో 62 ఎకరాల విస్తీర్ణంలో నర్మెట్ట గ్రామంలో ఆయిల్ శుద్ధి కర్మాగారం ఏర్పాటు కోసం 4 నెలల క్రితం భూమి పూజ చేసి పనులు ప్రారంభించామన్నారు. కిష్టారెడ్డి, పరశురాములుగౌడ్, కోటిరెడ్డి పాల్గొన్నారు.

వేతనాలు ఇప్పించాలని కాంట్రాక్టు లెక్చరర్ల వినతి

మెదక్, జనవరి 11: పెండింగ్ వేతనాలు ఇప్పించాలని డిగ్రీ కళాశాల కాంట్రాక్టు లెక్చరర్లు గురువారం క్యాంపు కార్యాలయంలో ఎమెల్యే మైనంపల్లి రోహిత్‌ను కలిసి విన్నవించారు. ఐదు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఉన్నత విద్యా కమిషనర్ బుర్రా వెంకటేశంతో ఫోన్‌లో మాట్లాడారు. తమ కళాశాల లెక్చరర్లు వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జీతాలు అందేలా ఏర్పాటు చేస్తానని కమిషనర్ బదులిచ్చారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రోహిత్ రావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు వినోద్‌కుమార్, పశుపతిశర్మ, రాజు, సుధారాణి, హరిత పాల్గొన్నారు.

మేడిపాపన్న నాయకత్వంలో మరో పోరాటానికి సిద్ధం

సిద్దిపేట అగ్రికల్చర్, జనవరి 11: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (మాదిగ దండోరా) రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న నాయకత్వంలో మరో పోరాటానికి సిద్ధం కావాలని జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మేడి పాపన్న ఆదేశం మేరకు జిల్లా కమిటీ సమావేశం గురువారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా అధ్యక్ష, కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు, డప్పు, చెప్పు పెన్షన్, మాదిగ పారిశుద్ధ్య కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్లో పెట్టడమా..? రాష్ట్రాలకు అధికారాలు ఇవ్వడమా.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తేల్చాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లాలో మాదిగల సమగ్రాభివృద్ధి ప్రధాన లక్ష్యంగా సంఘం పనిచేస్తున్నదని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని కోరారు. హైదరాబాద్‌లో మాదిగల భవనానికి ఎకరం స్థలం కేటాయించి కోటి రూపాయల బడ్జెట్‌ను విడుదల చేయాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి భూపాల్, రాజమల్లయ్య, రాష్ట్ర కార్యదర్శి వెంకట్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజేష్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్

హిట్ అండ్ రన్ సెక్షన్‌ను వెంటనే రద్దు చేయాలి

గజ్వేల్, జనవరి 11: రవాణా రంగంలో పని చేస్తున్న డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడేసే విధంగా పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన హిట్ అండ్ రన్ 106(1)(2) సెక్షన్‌ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని రాజీవ్ రహదారిపై డైమాన్ లారీ యూనియన్-ప్రజ్ఞాపూర్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన మోటారు వెహికిల్ యాక్టులోని సెక్షన్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా పబ్లిక్, ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు ఆధ్వర్యంలో 10 నుంచి 14 వరకు నిరసన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ చట్టం వల్ల డ్రైవర్ల ప్రాణాలకు ముప్పు ఉంటుందన్నారు. కుటుంబాన్ని పోషించుకునేందుకు డ్రైవర్ వృత్తిలో చేరితే డ్రైవర్ కుటుంబాలకు భద్రత లేదని, గుర్తింపుకార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరోగ్యబీమా, ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రమేశ్, వెంకటేశం, బాలరాజు, రాములు, రాజు పాల్గొన్నారు.


ప్రజ్ఞాపూర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ఎల్లయ్య